క్లుప్తంగా

వినాయక చవితిని ఆనందంగా జరుపుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: వినాయక చవితి పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సకల శుభాలను ఇచ్చే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో చేసుకోవాలన్నారు.

వైఎస్సార్ వర్ధంతికి విగ్రహాల ముస్తాబు



దాసరపల్లిలో నూతన రూపు సంతరించుకున్న వైఎస్సార్ విగ్రహం

ఉదయగిరి: వచ్చే నెల 2వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలో ఉన్న 27 విగ్రహాలు నూతన రంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. పార్టీ మండల నాయకుడు కొండా రాజగోపాల్‌రెడ్డి అన్ని విగ్రహాలకు సొంత నిధులతో రంగులు వేయించి ముస్తాబు చేయిస్తున్నారు. ఇప్పటికే జి.అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, దాసరపల్లి, అప్పసముద్రం, నడింపల్లి గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు రంగులు వేయడం పూర్తయ్యాయి.

హెచ్‌ఐవీపై అవగాహన



ఆత్మకూరురూరల్: చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ వారి ఆధ్వర్యంలో మండలంలోని వాశిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సీడబ్ల్యూఓ శశికళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఐవీ సంక్రమించే విధానం గురించి వివరించారు. విద్యార్థి దశ నుంచే హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం కె.వాణి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో 651 విగ్రహాలకు అనుమతులు



మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు: ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా ఆత్మకూరు డివిజన్ పరిధిలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు 651 దరఖాస్తులు అందాయని, ఈ మేరకు అనుమతులు ఇచ్చామని డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి సీఐ వేమారెడ్డి, ఎస్సై జిలానీతో కలిసి మంగళవారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి పండగను ప్రజలు జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో డీజే, అశ్లీల నృత్యాలు, మద్యం సేవించడం లాంటివి జరగకుండా ఆయా కమిటీల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీఏఐ 2.0పై శిక్షణ రేపు

దుత్తలూరు: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

ఉర్దూ పాఠశాలల సందర్శన

మర్రిపాడు: జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజా మొహిద్దీన్ మండలంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్‌లు, ఎఫ్ఏ-1 పరీక్షల బుక్‌లెట్‌లను పరిశీలించారు. సింగనపల్లి ఉర్దూ, కదిరినేనిపల్లి ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు బాగున్నాయన్నారు. అనంతరం కంపసముద్రం ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈఓ-1 తిరుపతయ్య, ఎంఈఓ-2 ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఊరూ వాడా చవితి కోలాహలం



ఉదయగిరి: పూజ సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



సంగం: వినాయకుని విగ్రహాన్ని తీసుకెళ్తూ..

విఘ్నాలు తొలగించే వినాయకుడి పుట్టినరోజును జరుపుకునేందుకు ఊరూ వాడా సిద్ధమైంది. గ్రామాలు, పట్టణాల్లో భారీ గణనాథుల విగ్రహాల ఏర్పాటుకు రెండు రోజుల ముందు నుంచే పనులను చురుగ్గా పూర్తి చేశారు. ఈ క్రమంలో మంగళవారం నుంచే వినాయక చవితి కోలాహలం మొదలైంది. పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్లకు క్యూ కట్టారు.

ఉదయగిరి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో భారీ గణనాథులు కొలువుదీరనున్నారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక వాహనాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాలను తరలించారు. ఉదయగిరిలో విగ్రహాల కొనుగోలు వద్ద, పూజా సామగ్రి కొనుగోలు దుకాణాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. గణేష్ ఉత్సవాల సందర్భంగా పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. భక్తులు విగ్రహాలను ఉదయగిరి, పామూరు, వింజమూరు తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. గ్రామాల్లో 3, 5, 7, 9 రోజులపాటు గణనాథులు పూజలు అందుకోనున్నారు.

• **ఆత్మకూరు:** పట్టణంలోని మెయిన్ బజారు, మున్సిపల్ బస్టాండ్, సోమశిల రోడ్డు సెంటర్, బీఎస్సార్ సెంటర్, ఎల్‌ఆర్‌పల్లి, నెల్లూరుపాళెం సెంటర్లలో రద్దీ నెలకొంది. వినాయకుడి చిన్న ప్రతిమలు, పత్రి, పూలు, చిన్న గొడుగులు, అరటి పిలకలు కొనుగోళ్లతో సందడి నెలకొంది. అదే క్రమంలో భారీ విగ్రహాలను యువకులు ఉత్సాహంగా తరలించారు.

• **దుత్తలూరు:** మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పర్వదినానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 3 నుంచి 5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. స్థానిక విశ్వతేజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు వివిధ రకాల ఆకృతులతో వినాయక ప్రతిమలను పాఠశాలలో ప్రదర్శించారు. కూరగాయలు, పండ్లు, ఆకులతో వినాయక స్వామి ప్రతిమలను చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉదయగిరి: గణనాథులను తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



సంగం: కిటకిటలాడుతున్న మార్కెట్ సెంటర్

• **కలిగిరి:** గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. విగ్రహాలు ఉంచే మండపాలను అంగరంగ వైభవంగా అలంకరించారు. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి గణనాథులను గ్రామాలకు తరలించారు.

• **సంగం:** మండల కేంద్రమైన సంగంతో పాటు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. మార్కెట్‌లో వినాయక విగ్రహాల కొనుగోలు జోరుగా సాగుతోంది. ఇప్పటికే వాడవాడలా విగ్రహాల ఏర్పాటు కోసం యువత మండపాలను సిద్ధం చేశారు. విగ్రహాల తయారీ కేంద్రం వద్ద నుంచి వాహనాల్లో తమ గ్రామాలకు గణనాథులను తరలించారు.

• **వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండల పరిధిలో వినాయక చవితి కోలాహలం మొదలైంది. వేడుకలు సజావుగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి.



ఆత్మకూరులో వినాయక విగ్రహాలను తరలిస్తూ..



ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తూ..



మట్టి వినాయక ప్రతిమలను చేస్తున్న చిన్నారులు



వింజమూరులో..



కలిగిరిలో..

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతారామపురం: అనాదిగా అభివృద్ధికి నోచుకోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మంగళవారం తహసీల్దార్ ఫజిహాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటుపై మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినందున కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వెనుకబడిన 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలని డిమాండ్ చేశారు. దీనిని రెవెన్యూ అధికార యంత్రాంగం మంత్రివర్గ ఉపసంఘానికి పంపేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, అయ్యవారిపల్లె సర్పంచ్ దుగ్గయ్య, పార్టీ నాయకులు మాబయ్య, చంద్రమౌళి, బ్రహ్మయ్య, ఖాసింపీరా, ఖాజావలీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి వెళ్లనీయడం లేదని ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సీతారామపురం: తమ పొలాల్లోకి వెళ్లనీయకుండా కొందరు భూస్వాములు అడ్డుకుంటున్నారని చిన్నాగంపల్లి గ్రామానికి చెందిన పలువురు బాధితులు తహసీల్దార్ ఫజిహాకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నాగంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 63-ఏ, 63-బీ, 63-సీ, 63-పీలలో కాకర్ల కుమారి, రామలక్ష్మమ్మ, చెరుకుపల్లి జయమ్మ, తాళ్లపల్లి నాగమ్మలకు 0.84 సెంట్ల చొప్పున భూములకు సంబంధించి 2013లో పట్టా పాసు పుస్తకాలు ఇచ్చి ఉన్నారన్నారు. అప్పటి నుంచి వాటిని తాము సాగు చేసుకుంటుంటే గ్రామానికి చెందిన రమణారెడ్డి, రమణయ్యలు ఆ భూములపై అభ్యంతరాలు తెలపడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఉన్నామన్నారు. వారు విచారించి ఆ భూములు తిరిగి తమకే కేటాయించారన్నారు. అయితే ప్రస్తుతం తాము ఆ భూమిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతుండగా రమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రమణయ్యలు అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ ఫజిహా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేస్తామన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సీతారామపురం: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలలో రెండు డీఏలను వెంటనే ప్రకటించి, అసెస్‌మెంట్ బుక్స్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలన్నారు. అలాగే విద్యాశాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించి బోధనకు సమయం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భోగ్యం శ్రీనివాసులు, గొడ్లవేటి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు రహంతుజానీ, జిల్లా కౌన్సిలర్ పేరాల శ్రీనివాసులు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి మహేష్, సారె సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమానత్వ దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్

ఉదయగిరి రూరల్: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్.నారాయణస్వామి అధ్యక్షతన మహిళా సమానత్వ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి లేకుండా సమాజాభివృద్ధి సాధ్యపడదన్నారు. సమానత్వం లక్ష్యంగా ప్రతి విద్యార్థిని ముందుకు సాగాలన్నారు. అనంతరం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, మహిళా శక్తి ప్రబోధన సెల్ కన్వీనర్ రాధిక, మహిళా అధ్యాపకులు పద్మజ, పుష్పమ్మ, కరీమున్నీసా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు జరుగుతున్నందున మురుగు ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

రైల్లోంచి జారిపడి వ్యక్తి మృత్యువాత

కావలి (జలదంకి): రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కావలి-తెట్టు రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. జార్కండ్ రాష్ట్రానికి చెందిన సోమ్రా నాగేసియా (30) రైల్లో ప్రయాణిస్తూ జారి పడి మరణించారు. అతని మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. రైల్వే ఎస్సై వెంకట్రావ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో

• వ్యక్తికి తీవ్రగాయాలు



మర్రిపాడు: బైక్‌ను బులెరో వాహనం ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకుంది. డీసీపల్లి గ్రామానికి చెందిన కడెం రామస్వామి టోల్‌గేట్ సమీపంలోనే చిన్న దుకాణం నడుపుకుంటూ ఉంటాడు. మంగళవారం రాత్రి పలు సామగ్రిని తీసుకుని టోల్‌గేట్ సమీపంలోని తన దుకాణానికి టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా నందవరం వైపు నుంచి వస్తున్న బులెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామస్వామికి గాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కావలి (జలదంకి): బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు తీవ్రగాయాల పాలై మృతిచెందిన ఘటన కావలి పట్టణం ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామానికి చెందిన కందుకూరి రామేశ్వరరావు అనే వృద్ధుడు (68) సొంత పనినిమిత్తం కావలికి వెళ్లి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలోని బట్టలదిన్నెరోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం కావలికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలి

ఉదయగిరి రూరల్: మండలంలోని డ్రాపౌట్స్ చిన్నారులను ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 50 మంది డ్రాపౌట్స్‌ను గుర్తించామన్నారు. వారిలో 19 మంది తల్లిదండ్రులతో కలిసి వలస ప్రాంతాలకు వెళ్లారన్నారు. ఇద్దరు విద్యార్థులను పాఠశాలలో చేర్పించామన్నారు. మరో నలుగురు పాఠశాలలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు బాధ్యతలు తీసుకొని డ్రాపౌట్స్ విద్యార్థులను బడిలో చేర్పించాలన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం



ఆత్మకూరు: మాట్లాడుతున్న రామ్‌కుమార్



అల్లూరు: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ పెంచల వీరేంద్ర

ఆత్మకూరు: రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ప్రభుత్వం అక్షరాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతోందని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్ అన్నారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ చలపతి, ఎంపీడీఓ రఫీఖాన్‌ల ఆధ్వర్యంలో వయోజన విద్య మండల స్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలో 890 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారికి శిక్షణ ఇచ్చేందుకు 89 మంది వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణలో పూర్తిస్థాయి అవగాహన పొంది గ్రామాల్లో స్థానికంగా ఉండే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వయోజన విద్యను నిర్వహించవచ్చని అక్షరాంధ్ర శిక్షణా కార్యక్రమ రిసోర్స్‌పర్సన్ రవీంద్రకుమార్ అన్నారు. వయోజనులకు చదవడం, రాయడం, లెక్కించడం తదితర కనీస పరిజ్ఞానం సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం హరి, ఏపీఓ మధు పాల్గొన్నారు.

• **అల్లూరు:** సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే అక్షరాంధ్ర లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపీడీఓ పెంచల వీరేంద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 250 మంది వలంటీర్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, ఎంఈఓ రవీంద్ర, ఆడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ శిరీషా, రిసోర్స్ పర్సన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



సంగం: రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ దేవసేన



అల్లూరులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సంగం: సంగం మండలంలోని ఎరువుల దుకాణాలను డీఆర్సీ ఏడీఏ దేవసేన, మండల వ్యవసాయాధికారి శశిధర్ మంగళవారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ రికార్డులను పరిశీలించారు. యూరియాను దారి మళ్లిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. డీలర్లు ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని, స్టాక్, సేల్స్ మధ్య వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

• **అల్లూరు:** ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వింజమూరు, కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శేషగిరి, నాగరాజు అన్నారు. అల్లూరులోని ఎరువుల దుకాణాలను వారు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామని, స్టాకు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బస్సుల్లేక నరకయాతన

• గంటల తరబడి నిరీక్షణ • వచ్చిన బస్సులూ ఆపకుండా వెళ్లిపోయిన వైనం





ఆత్మకూరు పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు: తొలి పండగ వేళ ప్రజలకు చుక్కలు కనిపించాయి. వినాయక చవితిని పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు బస్సుల కోసం పడిగాపులు కాస్తూ నరకయాతన అనుభవించారు. సాధారణంగా పండగకు ప్రత్యేక బస్సులు వేయాల్సిన ఆర్టీసీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

బస్సుల సంఖ్యను పెంచాలి

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు మంగళవారం మధ్యాహ్నం గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సెంటర్ నుంచి వింజమూరు, కావలి బస్సులు ఓ మార్గంలో, మరో మార్గంలో మర్రిపాడు, బద్వేల్, కడప, ప్రొద్దుటూరు బస్సులు, ఇంకోవైపు ఉదయగిరి, సీతారామపురం మార్గంలో వెళ్లే బస్సులు ఈ మార్గం గుండా వెళ్లాల్సి రావడంతో ప్రయాణికుల రద్దీ నెలకొంది. మహిళలకు ఉచిత బస్సు ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచకపోవడం, కొన్ని బస్సులకే ఉచితం పరిమితం కావడంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య రెండింతలుగా ఉంది. దీంతో నెల్లూరు నుంచి ఉదయగిరి, బద్వేల్, కడపకు వెళ్లే బస్సుల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండడంతో వచ్చిన అరకొర బస్సులూ నెల్లూరుపాళెం సెంటర్ వద్ద ఆపకుండా వెళ్లడంతో ఎదురుచూస్తున్న ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. సుమారు రెండు గంటలకుపైగా బస్సుల కోసం ఎదురుచూస్తున్నట్లు పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. పండగ రోజుల్లో అయినా ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు.